
# ఢిల్లీ వెళ్ళాలి

'మానస'





రామారావుకి ఉన్నట్టుండి తోచడం మానేసింది!

రోజూ ఆఫీసుకెళ్ళి రావడం... సాయంత్రం పూట బజార్లలో కాలక్షేపం చెయ్యడం చాల విసుగ్గా అనిపించాయి. శలవు చూస్తే... మురిగిపోయింది పోగా, ఇంకా ఆర్నెల్లుంది. అంతే... అర్జంటుగా ఓ నెల్లాళ్ళు శలవు పెట్టి 'ఎక్కడికైనా వెళ్ళాల'ని నిర్ణయం చేసుకున్నాడు.

"నెల్లాళ్ళ శలవా ? సరే, బాగానే ఉంది – దేనికీ ? ఎక్కడికెళ్తావు ?" అని సెక్షన్ హెడ్డు అడిగేదాకా రామారావుకి ఆ విషయం తట్టలేదు.

"ఢిల్లీ వెళ్ళాలి. మా తోడల్లుడున్నాడక్కడ. చాల రోజులైందతన్ని చూసి. పైగా, ఢిల్లీ చూడాలని చాలకాలంగా అనుకుంటున్నాను కూడా! మన రాజధానిని ఇంతదాకా చూడకపోవడం దారుణం కదండీ! అందుకే అర్జంటుగా శలవు కావాలని అర్జీ పెట్టుకున్నాను" శలవుకి కారణాన్ని రెడీమేడ్‌గా చెప్పేడు రామారావ్.

శలవు సిఫార్సు చెయ్యక తప్పింది కాదు, సెక్షన్ హెడ్డుకి.

ఆ మర్నాటి నుండి మంజూరైంది, శలవు.

హుషారుగా వెళ్ళి భార్యకి చెప్పేడీ విషయం. భర్త హఠాత్ నిర్ణయానికి ఆ ఇల్లాలు రవ్వంత విస్తుపోయినా... చాలకాలం తర్వాత తన అక్కనీ, బావనీ... పిల్లల్నీ చూడబోతున్నందుకు సంబరపడిపోయింది. అయితే... ఆ సంబరం అయిదు నిముషాలు కూడా ఆగలేదు... రామారావు తన తోడల్లుడు సుబ్రమణ్యం అడ్రసు అడిగేసరికి. ఇల్లంతా గాలించింది, అడ్రసు కోసం. దొరకలేదు...

'ఎప్పుడో మూడేళ్ళైందది ఉత్తరం రాసి. ఎక్కడని దాచిపెట్టుకోను ? అయినా, ఆ మాత్రం అడ్రస్‌ల పుస్తకంలో రాసుకుని ఉంచుకోకపోయారూ ?'

'ఆ మాత్రం ఉత్తరం జాగ్రత్త చెయ్యలేకపోయావా ?'ని రామారావు విసిరిన విసురుకి, విసురుగానే సమాధానమిచ్చింది, భార్యామణి.

రామారావు నోరు మెదపలేకపోయాడు. మనసులోనే విసుక్కున్నాడు, భార్యమీద. సుబ్రమణ్యం ఆఫీసు అడ్రసు చూచాయగా జ్ఞాపకం ఉంది. కానీ, ఆ అడ్రసు ప్రకారం రాస్తే – ఉత్తరం అందకపోవచ్చు. ఇంటి నంబరూ, వగైరా గుర్తులేవుగానీ... ఢిల్లీలో రామక్రిష్ణాపురంలో ఉంటున్నాడని తెలుసు. అయితే, ధైర్యంచేసి వెళ్ళిపోతే ఇల్లు పట్టుకోవడం అంత తేలికకాదేమో ?

ఉన్నట్టుండి రామారావుకి మెరుపులాంటి ఆలోచనొచ్చింది. సుబ్రమణ్యం స్నేహితుడొకాయన తనింటికి అయిదారిళ్ళవతలే ఉంటున్నాడు. అతను తనంత బద్ధకస్తుడయ్యుండడనీ...మిత్రుడి అడ్రసు ఎక్కడో రాసుకునే ఉంటాడనీ...అనుకుని వెళ్తే... అతగాడు ఊళ్ళోలేడు. అతని భార్యకి తనొచ్చిన పని వివరించి చెప్పి ... ప్రాధేయపూర్వకంగా చూసేడు. ఆ ఇల్లాలు ఉత్తరాల ఫైలంతా వెదికి అతికష్టం మీద సుబ్రమణ్యం అడ్రసు తీసిచ్చింది. సంబరపడిపోయాడు, రామారావ్.

వాయువేగంతో రైల్వేస్టేషన్‌కి వెళ్ళిపోయాడు!

'ఢిల్లీకి మన ఊరినుండి డైరెక్టుగా ట్రైన్ లేదు. కాజీపేటనుంచి రిజర్వేషన్ చేయించాలి. టెలిగ్రాం కన్ఫర్మేషన్ వస్తేగానీ ... ఖాయంగా రిజర్వేషన్ దొరికిందీ లేందీ చెప్పలేం. కాబట్టి, ఇప్పటికిప్పుడు టిక్కెట్లు దొరకవు. పదిరోజులాగాలి!'

'సరే'ననక తప్పలేదు రామారావుకి. కొంచెం నీరసపడ్డాడు. నెలరోజుల శలవులో పదిరోజులు ఉన్న ఊళ్ళోనే గడపాలనీ ... హాయిగా నెల్లాళ్ళపాటు ఢిల్లీ అంతా గాలించదల్చుకున్న ప్రోగ్రాం రానుపోను ప్రయాణ సమయం తీసేస్తే పదిహేనురోజులకే పరిమితమౌతోందని మరింత దిగులుపడ్డాడు.

స్టేషన్లో కూర్చునే ఉత్తరం రాసేడు తోడల్లుడికి. వారం పదిరోజుల్లో బయల్దేరి వస్తున్నట్టూ ... వచ్చేముందు టెలిగ్రామ్ ఇచ్చే బయల్దేరేటట్టూ! అన్యథాభావించక తను ఢిల్లీలో ఉండే పదిహేనిరవైరోజుల్లో కనీసం ఓ వారం రోజులైనా తనకూడా ఉండి ... చూడాల్సినవన్నీ చూపించమనీ ... అక్కౌంట్లో శలవు ఆర్నెల్లుంది కాబట్టి ... అవసరం అయి ఇంకా చూడాల్సి ఉంటే తను శలవు పొడిగించే అవకాశం ఉందని కూడా రాసేడు.

'ఢిల్లీలో చలెక్కువట. పిల్లలకి బూట్లు మేజోళ్ళూకొనాలి. మరోరెండు రగ్గులైనాకొంటే గానీసరిపోయేట్టులేవు. ఆడపిల్లలిద్దరికీ అద్దాల పరికిణీలుకొనాలనుకుంది మా అక్కయ్యక్రిందటిసారి. టైమ్ చాలక అది వీలవలేదప్పుడు – వాళ్ళ పిల్లలకవి రెండూ కొనుక్కెళ్తే బాగుంటుంది!" రామారావు భార్య చిన్న ఇండెంటు పెట్టింది.


"మన పిల్లలకి బూట్లూ, మేజోళ్ళూ అన్నావు, బావుంది. కొంటాను – రగ్గులు దండగ – మనకి చలికాలమే లేదు. తరవాతవన్నీ అటకెక్కించాలి. కాబట్టి, ఎలాగో సర్దుకుపోవాం, తెల్సిందా! ఇహ, మీ అక్కయ్య పిల్లలకి పరికిణీలు! వాళ్ళు ఇప్పుడెంతెంత సైజుల్లో ఉన్నారో మనకి తెలీదు. తీసుకెళ్ళినవి సరిపోకపోతే పేచీ! అందుకని, అక్కడికెళ్ళిన తరవాత ఏదేసి రూపాయ లిచ్చేదాం, వాళ్ళే కొనుక్కుంటారు —" రామారావ్ నిర్ణయం తీసుకుంటే దాంట్లో మళ్ళీ మార్పన్నది ఉండదని అతని భార్యకి తెలుసు. అందుకే, మళ్ళీ మాట్లాడలేదా ఇల్లాలు!

ఆరు రోజులు గడిచిపోయాయి!

* * *

రామారావ్‌గారూ!

బొంబాయిలో ఉన్నాం... వచ్చేరుకాదు మీరు!



ఆ తరవాత కలకత్తాకి మారి రెండేళ్ళున్నామా — ఇదిగో అదిగో అనడమేగాని, వచ్చింది లేదు. ఇప్పుడు ఢిల్లీ చేరి మూడేళ్ళొతోంది. అంటే...? మరో ఆర్నెల్లలో మకాం ఎత్తేసే టైమన్నమాట! కనీసం ఇప్పుడైనా దయతలిచారు, మామీద. చాలా చాల థాంక్స్! తప్పకుండా మీరూ..., మరదలూ, పిల్లలూ అంతా వచ్చి మాతో గడిపి మమ్మల్ని ఆనందపర్చాలనీ నా ఆకాంక్ష. మీకోసం ఎదురు చూస్తుంటాము, తప్పకుండా రండి — యు ఆర్ మోస్ట్ వెల్‌కమ్! ఆఁ... అన్నట్టు 'వెల్‌కమ్' అంటే జ్ఞాపకం వచ్చింది... మీ రాకకోసం ఎదురు చూసే, ప్లస్ మీకు స్వాగతం పలికే మరో వ్యక్తి గురించి రాయడం మర్చిపోయాను — 'బాబూసింగ్' అని ఆయన నా కొలీగ్. మాటల్లో మీ గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆసక్తిగా అడుగుతుంటాడు. ప్రవాసాంధ్రుడిగా ఉండాల్సొచ్చినా బాబూసింగ్ కంపెనీలో నేనెంతో రిలాక్సవుతుంటాను. సాంప్రదాయాల్లో... ఆచార వ్యవహారాల్లో... నిజానికి ఎంతో తేడా ఉండాల్సిన పరిస్థితే అయినా బాబూసింగ్ అలా ఉండడు. అందర్లో కలిసిపోతాడు. మనతో ఉన్నప్పుడు మనలాగానే ఉంటాడు. బాబూసింగ్ చరిత్రాత్మకమైన మన ప్రాంతాలు చూడాలనీ... విశేషాలు తెల్సుకోవాలనీ, ఉబలాటంలో ఉన్నాడు. ఆంధ్రదేశ వైభవం గురించి చాలసార్లు ప్రస్తావించాడు.

'నేనీసారి ఆంధ్రాకివెళ్తున్నప్పుడు తీసికెళ్తాన'ని అతగాడికి హామీ ఇచ్చినా ... ఇంతలో వచ్చేట్టులేను. ఆర్నెల్లలో ఢిల్లీ వదిలేసి కోయంబత్తూరు వెళ్ళిపోవాలి! బాబూసింగ్ కూడా వెళ్ళిపోవచ్చు ఈ లోపల!

సమయానికి దేవుళ్ళాగా కనిపించారు!

మీ తిరుగు ప్రయాణంలో మీతో కలిసి ఆంధ్రావస్తాడు, బాబూసింగ్.

అరసవిల్లిలో సూర్యనారాయణమూర్తినీ ... శ్రీకూర్మం కూర్మావతారాన్నీ ... సింహాచలం లక్ష్మీనృసింహుడ్నీ...అన్నవరం సత్యనారాయణుడ్నీ, ద్వారకా తిరుమల వెంకటేశ్వరుడ్నీ ... బెజవాడ కనకదుర్గనీ ... శ్రీశైలం మల్లిఖార్జునుడ్నీ ... భద్రాచలం శ్రీరామచంద్రుడ్నీ ... తిరుపతిలో వెంకన్ననీ ... మంత్రాలయంలో రాఘవేంద్రుడ్నీ ... బందర్లో పాండురంగడ్నీ ... ద్రాక్షారామంలో భీమేశ్వరుడ్నీ చూపించగలరని నాకు తెలుసు!

కానీ, బాబూసింగ్ పుస్తకాల్లోచదివి విశిష్టత తెల్సుకున్నవీ ... మిత్రులద్వారా విని అభిలాష పెంచుకున్నవీ మరికొన్ని ప్రదేశాలున్నాయట. ఎలాగో సాయం పట్టండి. 'అలనాటి చక్రవర్తుల కీర్తి ప్రతీకలుగా ... భక్తిశ్రద్ధలకి తార్కాణంగా మిగిలిపోయిన ప్రశస్త దేవాలయాలెన్నో గొల్లల మామిడాడలో ఉన్నాయటగా ... లెక్కకి కోటి లింగాలూ కనపడకపోయినా ... ఆ అనుభూతిని కలిగించే కోటిపల్లి రేవు చూడదగ్గదిటగా మణ్యంజీ!'

ఏంవిటో బాబూసింగ్ పిచ్చిగా అడుగుతున్నాడు గానీ ... వేరే వేస్టు కాబట్టి, ద్రాక్షారామం వెళ్ళినప్పుడే ఈ రెండూ చుట్టించెయ్యండి!

'సుమారు నలభై అడుగుల ఎత్తులో ఉండి... భూత, ప్రేత పిశాచాలన్నిటినీ నమిలి మింగేసే ఉగ్రస్వరూపంతో ఆంజనేయుడు పామర్రులో ఉన్నాడు. అక్కడే భావన్నారాయణుడూ, గరుత్మంతుడు కూడా ఉన్నారు — చూడాలి' బాబూసింగ్‌లో అన్నీ చిన్నపిల్లాడి లక్షణాలు—తిరుపతి కెళ్తున్నప్పుడు దింపెయ్యండి గురడ్ని పామర్రులో! విడిగా వెళ్ళక్కర్లేదు. తిరుపతి నుంచి హైదరాబాదొస్తున్నప్పుడు మహానంది తగుల్తుంది కాబట్టి ఆ ముచ్చటా తీర్చండి! 'ఏడడుగుల లోతు కొలనులో సూది పడేస్తే కనిపించే స్వచ్ఛమైన నీళ్ళుటగా మణ్యంజీ ... నేతప్పకుండా చూడాలి!' ఒక్కటే ఉబలాటం బాబూసింగ్‌ది.

హైదరాబాద్‌లో గోల్కొండ కోట... చార్మినార్, మ్యూజియం, ఫలక్‌నామా పేలస్సూ... జూలాజికల్ పార్కూ, అసెంబ్లీ, పబ్లిగ్గార్డెన్సూ... బిర్లా వెంకటేశ్వరుడి గుడీ .. పాపం గురుడివే కోరుకున్నాడు. అక్కడికి వెళ్ళిన తరువాత ఇంకా ముచ్చటపడ్డా మీరీజీగా ఏర్పాటు చేసెయ్యగలరుగా... సిటీ టూర్ రెండు టిక్కెట్లు కొనేస్తే సరిపోతుంది కాబట్టి!

యాదగిరిగుట్టకి వెళ్తారు—ఓకే! దాంతోపాటు వరంగల్‌కి తీసికెళ్ళి పుణ్యం కట్టుకున్నారంటే... వెయ్యి స్తంభాల గుడీ, కాకతీయ శిధిలాలూ, రామప్పగుడీ... పాకాల చెరువూ చూసేస్తాడు, పనిలో పనిగా!

కేవలం పుణ్యక్షేత్రాలూ... చారిత్రాత్మకమైన ప్రదేశాలే చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాడు కాబట్టి... టూకీగా ఇలా చూపించెయ్యండి! - అలాగాక, మిగతావికూడా చూస్తానంటే సింహాచలం వెళ్ళినప్పుడే వైజాగ్‌లో మకాం పెట్టేసి... షిప్ యార్డూ... పోర్టూ, లైట్‌హౌసూ, ఔటర్ హార్బరూ... అరకులోయా చూపించెయ్యండి —

అలాగే, కోనసీమ వైభవం అని ఉవ్విళ్ళూరితే... ద్రాక్షారామ నుంచి అమలాపురం దారి పట్టించి, ఆ సరదా కూడా తీర్చేస్తారని నాకు నమ్మకం ఉంది. అయినా — ఈ విషయాలన్నీ మీరొచ్చినప్పుడు మాట్లాడుకోవచ్చుగా ... మీ టైమెందుకు వేస్టు చెయ్యడం, సోది రాసి? మీరూ, పిల్లలూ వెంటనే బయల్దేరి రండి — మీ టెలిగ్రాం చూసుకుని నేనూ, బాబూసింగూ స్టేషన్‌కి వస్తాము. మరి శలవా?

మీ తోడల్లుడు,
సుబ్రమణ్యం.

* * *

"ఏమయ్యా రామారావూ! తోడల్లుడ్ని అర్జెంటుగా చూడాలని శలవు పెట్టేవు. టిక్కెట్లు కూడా కొన్నావులా ఉంది —"

"అవునండీ దేనికైనా ప్రాప్తం ఉండొద్దూ? మా తోడల్లుడు ఉన్నట్టుండి ఫారి నెళ్ళిపోయాడు, ఫేమిలీతోసహా!"

"అయితే, శలవు రద్దు చేసుకుని డ్యూటీలో జాయినైపోతున్నావన్నమాట! పోన్లే, కొన్నాళ్ళాగి వెళ్ళిరా!"

"మళ్ళీ ఇప్పట్లో రారండీ! కనీసం నాలుగైదేళ్ళైనా పడ్తుంది!"

"సరే .. శలవు రద్దుచేస్తున్నానులే! ఇవాళే డ్యూటీలో జాయినైపో!"

"అలాగే సార్!"

* * *

"మిమ్మల్నందర్నీ ఇప్పట్లో చూసే అదృష్టం మాకు లేనట్టుంది. దేనికైనా ప్రాప్తముండాలి కదా! ఆఫీసుకి ఆడిటర్లు ఇప్పుడే తగలడాలా ...? మేమంతా గొప్పగా డిసప్పాయింటయ్యాం! అందరి కన్నా ముఖ్యంగా బాబూసింగు!

స్వాగతం!

మీ కోసం ఆశతో ఎదురు చూస్తుంటాము. ముఖ్యంగా, మీరెప్పుడు ఢిల్లీ వస్తారా అని వెయ్యి కళ్ళతో బాబూసింగ్ ఎదురుచూస్తూనే ఉంటాడు— తప్పకుండా వస్తారు కదూ!

సుస్వాగతం!!

— సుబ్రమణ్యం

* * *

"ఏమిటయ్యా ... రామారావ్, ఆంధ్రప్రదేశ్ మ్యాపుని అంత తీక్షణంగా పరిశీలిస్తున్నావు! ఏదైనా రిసెర్చా ...?" ఆసక్తిగా అడిగేడు సెక్షన్ హెడ్డు.

"కాదండీ ... పుణ్యక్షేత్రాలూ — విహార స్థలాలూ — చారిత్రాత్మకమైన ప్రదేశాలూ ... పారిశ్రామిక ప్రదేశాలూ, ఇవన్నీ ఐదో క్లాసు చదివే మా అమ్మాయి సిలబస్‌లో — పరువుపోతోం దంటే నమ్మండి; ఇవన్నీ ఎక్కడెక్కడున్నాయో నాకే తెలీదు.

'ఎక్కడున్నాయి నాన్నా' అని మా అమ్మాయి అడుగుతుంటే ... దడొచ్చేస్తోంది, నాకు!

"అందుకని ...?"

"దానికి పాఠం చెప్పడానికి నేను తయారౌతున్నాను, అంతే! అంతేసార్ ...!" ★